భారమవుతున్న బడి

- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు ఏవీ?
- అడ్మిషన్ల కోసం ఊరూరా ప్రచారం
- టెక్నో, ఈ టెక్నో, సీబీఎస్ఈ పేరుతో విద్యార్థులకు వల
- చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరవు
- కొవ్వూరు డివిజన్‌లో 537 ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్, ప్రైమరీ పాఠశాలలు


నిడదవోలు రూరల్: ప్రైవేటు పాఠశాలల్లో ఏటా పెరుగుతున్న ఫీజులతో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు బడి భారమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల జులుం ప్రదర్శించడంతో చిన్నారుల తల్లిదండ్రులు విలవిల్లాడుతున్నారు.

విద్యార్థుల ప్రవేశాలకు టార్గెట్


ఉపాధ్యాయులపై సంబంధిత యాజమాన్యాలు అడ్మిషన్ల భారం మోపుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి నెల రోజులు ముందే విద్యార్థుల ప్రవేశాలకు టార్గెట్ విధించాయి. రోజుకు ఇంత మంది పిల్లలను అడ్మిషన్ చేయాలని సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నాయి. పిల్లలను చేర్పిస్తేనే ఉద్యోగం ఉంటుందని, లేకపోతే ఇతర ఉద్యోగాలు చూసుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో తమ ఉద్యోగ భద్రత కోసం ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను ప్రాధేయపడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల టీచర్లు అడ్మిషన్ల కోసం ఎన్నికల ప్రచారంలా ఇంటింటికీ క్యాంపెయినింగ్ చేస్తున్నారు. టెక్నో, ఈ టెక్నో, సీబీఎస్ఈ పేరుతో ప్రైవేటు యాజమాన్యాలు తరగతుల వారీగా అడ్మిషన్లు చేయాలని నిర్దేశించడంతో ఏం చేయాలో తెలియక ప్రైవేటు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలీచాలని వేతనాలు

కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో 537 ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్, ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. కొంతమంది ప్రైవేటు పాఠశాలల్లో టీచర్లుగా పనిచేస్తూనే ప్రభుత్వ కొలువుకు సిద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం ఏడాది కాలంగా అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ ఉద్యోగాల ఖాళీల భర్తీని విస్మరించడంతో ఈ ఏడాది కూడా ప్రైవేటు పాఠశాలల్లోనే పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బంది వాపోతున్నారు. ప్రాథమిక స్థాయి విద్యాబోధనకు టీచర్‌కు నెలకు రూ.7వేల నుంచి రూ.10 వేలలోపే ప్రైవేటు యాజమాన్యాలు జీతాలు ఇస్తున్నారు. ప్రైవేటు టీచర్లకు చాలీచాలనీ వేతనాలు ఇస్తూ వారి జీవితాలతో ఆయా యాజమాన్యాలు చెలగాటమాడుతున్నాయి. ప్రభుత్వ జీవో ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులో 59 శాతం ఉపాధ్యాయులకు వేతనాలకు కేటాయించాలి. ఈ విధానం ఎక్కడా అమలు కావడం లేదనే విమర్శలున్నాయి.



నిడదవోలు ప్రైవేటు పాఠశాలలో ఫీజుల వివరాలను రాసి తల్లిదండ్రులకు అందజేస్తున్న స్లిప్పులు (ఫైల్)



భారీగా ఫీజుల వసూలు

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలి. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి నుంచే భారీగా ఫీజులు దండుకుంటున్నారు. టెక్నో, ఈ టెక్నో, సీబీఎస్ఈ, ఐఐటీ కోచింగ్, అబాకస్, కరాటే, డ్రాయింగ్ పేరుతో తల్లిదండ్రులపై ఫీజుల భారాన్ని మోపుతున్నారు. నిబంధన ప్రకారం తరగతుల వారీగా ఫీజుల వివరాలు స్కూలు నోటీస్ బోర్డులో ప్రదర్శించాలి. ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు. ఫీజుల ధరలు సైతం చిన్న స్లిప్పులపై రాసి తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి రూ.20 వేలు వసూలు చేస్తుండగా బుక్స్ అదనంగా మరో రూ.3 వేల నుంచి రూ. 5వేల ఖర్చు చేయాల్సి వస్తోంది. అదనంగా యూనిఫాంలు, బూట్లు, సాక్సులు, టై లాంటివి ఆయా పాఠశాలల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చాలా వరకు కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. ప్రైవేటు భవనాల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి అంతంత మాత్రమే. క్రీడా వసతులు లేకపోవడంతో విద్యార్థులంతా పుస్తకాలతోనే కుస్తీ పట్టాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అధిక ఫీజులను కట్టడి చేయాలి



ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టి కట్టడి చేయాలి. ప్రభుత్వం అమ్మకు వందనం సొమ్ము జూన్ 12వ తేదీలోపు అందిస్తే ఫీజులు చెల్లించడానికి ఉపయోగపడతాయి. పాఠ్య, నోట్ పుస్తకాలు, షూలు, బెల్టులను ప్రైవేటు పాఠశాలల్లో అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి.

–సిర్రా బుల్లియ్య, సమిశ్రగూడెం

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టాం. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుంది. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచాలి. అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు పాఠశాలల టీచర్లను వేధింపులకు గురిచేసినా, ఫీజులు ఎక్కువ వసూలు డిమాండ్ చేస్తే ఆయా యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కేఎస్‌వీ గణేష్, ఎంఈఓ, నిడదవోలు

క్లుప్తంగా

‘మానవత’ కార్యవర్గం ఎంపిక


మానవత నూతన కార్యవర్గ సభ్యులు

నల్లజర్ల: మండల మానవత సంస్థకు నూతన కార్యవర్గం ఎంపికైనట్టు ఆ సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ తెలిపారు. ఆదివారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు తెలిపారు. అధ్యక్షులుగా ముసుళ్లగుంట గ్రామానికి చెందిన పాకలపాటి వెంకటేశ్వరావు, కార్యదర్శిగా చీపురుగూడెం గ్రామానికి చెందిన పత్తిపాటి రాంబాబు, కోశాధికారిగా ఐడీవీ అప్పారావును ఎన్నుకున్నట్టు చెప్పారు. చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ ఐనంపూడి రత్నాజీ, కన్వీనర్ గుళ్ళపూడివెంకటరత్నం, డైరక్టర్ పాతూరి సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ చైర్మన్ నందం రాజేంద్రప్రసాద్, కమిటీ మెంబరు దొండపాటి దుర్గారావు సమావేశంలో పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థికి నగదు బహుమతి


సలాంకు నగదు బహుమతి అందజేస్తున్న కెల్లా వాసు

నల్లజర్ల: దూబచర్ల సంఘమిత్ర పాఠశాల పదో తరగతి విద్యార్థి అబ్దుల్ సలాం రీ వేల్యుయేషన్‌లో మెరుగైన ఫలితం సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. అతని విజయాన్ని గుర్తించి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, వాసవి క్లబ్ మాజీ గవర్నర్ చీమకుర్తి కృష్ణకిశోర్ ఆదివారం రూ.10 వేలు నగదు పురస్కారాన్ని సలాంకు అందజేశారు. అతని తల్లిదండ్రులు జవహరుద్దీన్, నవ్యలను సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు, యోగా గురువు దూబగుంట్ల రాజారావు, కూరపాటి నాగరాజు, జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

దేవరపల్లి: దుద్దుకూరులో సోమవారం ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.సద్గుణరావు, కె.గాబ్రియేలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని షాలోమ్ టెంపుల్ వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని సద్గుణరావు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి శిబిరం జరిగే రోజునే వేమగిరిలోని ఆసుపత్రికి పంపిస్తామన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ లేదా ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని ఆయన చెప్పారు.

రేగులమ్మ జాతర ప్రారంభం

గోపాలపురం: పెద్దాపురం రేగులమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పిన్నమనేని వారి ఆడపడుచును పుట్టింటి నుంచి మెట్టినింటి వారైన వేములపల్లి వారి ఇంటికి గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో తరలించారు. ఊరి చివర ఉన్న గ్రామ దేవత రేగులమ్మను స్థానిక రామాలయం వద్దకు పొన్నులు వేస్తూ తీసుకువచ్చారు. ఈ ఉత్సవాలు జూన్ 8వ తేదీ వరకూ గ్రామంలో వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా ప్రతి రోజూ రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మానవత ఆర్థిక సాయం

నల్లజర్ల: అచ్చన్నపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న బచ్చు సత్యనారాయణ వరప్రసాద్‌కు మండల మానవత సభ్యులు రూ.5వేలును ఆర్థిక సాయంగా అందజేసారు. గ్రామ పెద్ద పాతూరి సత్యనారాయణ రూ.వెయ్యి అందజేసారు. పాతూరి రమేష్ రూ.500, కసుకుర్తి కృష్ణారావు రూ.200 అందజేసారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి వెంకటరత్నం, ప్రత్తిపాటి రాంబాబు, పాతూరి చిట్టబ్బాయి, కోడూరి నాగేశ్వరావు, పాకలపాటి నాగేశ్వరావు, దండమూడి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకం


ఉండ్రాజవరం గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో నందికి అభిషేకం చేస్తున్న పండితులు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో శ్రీబాల త్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రదోషకాలంలో నందీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మద్దిరాల తారకవెంకటరమణ మాట్లాడుతూ ప్రతి నెల అమావాస్య ముందు వచ్చే త్రయోదశి రోజున నందీశ్వరుడికి అభిషేకం, పూజలు చేస్తే గ్రహదోషాలు పోయి ఆరోగ్యం, మనశ్శాంతి లభిస్తుందన్నారు.

పక్కా గృహాల క్రమబద్ధీకరణకు చర్యలు

దేవరపల్లి: అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో అనధికారకంగా చేపట్టిన ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ శనివారం తెలిపారు. 2019 అక్టోబర్ 15 కంటే ముందు చేపట్టిన నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు ఆయన వివరించారు. దీనికి ఇంటి పన్ను, కరెంట్ బిల్లుతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150 చదరపు గజాల్లో నిర్మించిన ఇల్లు క్రమబద్ధీకరణ ఉచితమన్నారు. 15 ఏళ్లకు పైబడి గ్రామ శివారులలో పోరంబోకు స్థలాల్లో బేస్‌మెంట్‌తో కాంక్రీట్ లేదా రేకుల షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేసుకున్న (బీపీఎల్ కేటగిరీకి చెంది ఉండాలి. ఎటువంటి స్థిరాస్తి ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలం కలిగి ఉండరాదు) వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. గ్రామ సచివాలయంలో ఇచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్, ఆర్డీఓ సమక్షంలో పరిశీలించి సమగ్ర విచారణ అనంతరం శాశ్వత నివాస పట్టా ఇచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా అనసూయ


ఆచంట అనసూయ

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన ఆచంట అనసూయ నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్టు పార్టీ కేంద్ర కార్యలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో గోపాలపురం నియోజకవర్గం మహిళా విభాగం కన్వీనర్‌గా, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా, ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పదవులు నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన నాయకురాలిగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి ఆమె కృషి చేస్తున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు అనసూయ కృతజ్ఞతలు తెలిపారు. ఆచంట అనసూయను పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

29 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ నబీపేట ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ లైన్ నిర్మిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. ఈకారణంగా ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నబీపేట ఫీడర్ వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. వీరికి త్రీఫేజ్ సప్లయి తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 10గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామన్నారు.

ర్యాంపుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి


ప్రక్కిలంలో ప్రజాభిప్రాయ సేకరణలో వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి: గోదావరి ఏటి గట్టుకు ఆనుకుని ఉన్న ఇసుక ర్యాంపులు, ఇసుక స్టాక్ చేస్తున్న సందర్భంలో ప్రమాదాలు జరిగితే ర్యాంపు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అప్రమత్తతో ముందస్తు చర్యలు తీసుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత సూచించారు. మండలంలోని ప్రక్కిలంక లంక భూముల్లోని పట్టా భూముల్లో ఇసుక తొలగించడానికి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఆర్డీవో అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. 28 హెక్టార్లల్లో ఇసుక మేటలు తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కాకినాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో పలువురు గ్రామస్తులు, ఎన్‌జీవోలు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ గోదావరిలో ఇసుక లభ్యత ఎక్కువ ఉందని, దీంతో ఇసుక నిల్వ చేయాల్సి ఉందని తెలిపారు. వర్షాకాలంలో ఇసుక ఇతర జిల్లాలకు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం ఇసుక అమ్మకాలు జరగడం లేదని, స్టాక్ పాయింట్లకు మాత్రమే తరలిస్తున్నట్టు తెలిపారు. ర్యాంపుల వద్ద ఏటిగట్టుపై ప్రమాదాలు జరగకుండా అక్కడ చర్యలు తీసుకోవాల్సిన పూర్తి బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. డివిజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ చేయాల్సి ఉందని, ఇప్పటికే 6 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, ఆర్ఐ కె రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

జ్ఞాపకాల ఒడిలో... ఆత్మీయ సమ్మేళనం



చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చాగల్లు: బాల్యంలో కలసి చదువుకున్న స్నేహితులంతా చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. పాఠశాలలో 1999–2000లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారం తదితర రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వారి అనుభవాలను వివరించారు. ఈ అపూర్వ కలయిక ఎంతో ఆనందాన్నిచ్చిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. బాల్య స్నేహితులందరిని ఒక చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎప్పటికి మరిచిపోలేమని వారు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది పూర్వవిద్యార్థులు వారి కుటుంబసమేతంగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల్లో 30 మంది ఇంజనీర్లు, ఐదుగురు ఉపాధ్యాయులు, పలువురు పారిశ్రామిక వేత్తలు, అధ్యాపకులుగా స్థిరపడ్డారు. ఈ కార్యక్రమంలో పడమట శ్రీను, కామిశెట్టి బలరామ్, జొన్నకూటి రాజు, కోడూరి రాజశేఖర్, కూచిపూడి బేబి, జాన్ వెంకటలక్ష్మి, పూర్ణిమ, పోశమ్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


సమిశ్రగూడెంలో క్రికెట్ పోటీ విజేతలకు షీల్డ్, నగదు బహుమతులు అందజేస్తున్న నాయకులు

నిడదవోలు రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమిశ్రగూడెం ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన రహీం జట్టుకు, రన్నర్‌గా నిలిచిన సంతోష్ జట్టు సభ్యులకు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ సిద్ధార్థ, బెస్ట్ బౌలర్ వీరబాబుకు షీల్డులు, నగదు బహుమతులను గజ్జరపు శ్రీరమేష్, నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వడల అంబేడ్కర్, పెదపూడి కిషోర్, కాట్రు శాంతిరాజు, కిషోర్, ఆదర్శ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

నిడదవోలు : పట్టణంలోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహ శాస్త్రి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ అధ్వానం

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ అయ్యేనా?
- పట్టణంలోని వీధుల్లో పేరుకుపోతున్న చెత్త
- వాహనాలు పాడవడంతో ఇబ్బందులు

నిడదవోలు : నిడదవోలు పురపాలక సంఘంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కాకపోవడంతో పట్టణంలో పారిశుధ్య పర్యవేక్షణ లోపించింది. దీంతో పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కడ పడిపడితే అక్కడ కుప్పలుగా చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు పారిశుధ్య వాహనాలు ట్రాక్టర్, కాంపెక్టర్, ఈ–ఆటోలు, చిన్న జేసీబీలు మరమ్మతులకు గురవడంతో అవి మూలన పడ్డాయి. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌భాస్కర్ ఆరు నెలల క్రితం తణుకు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ నుంచి పీవీ రమణ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయన రెండు నెలలు పనిచేశారు. ఈ సమయంలో ఆయనపై పలు ఆరోపణలు రావడంతో తిరిగి డిప్యూటేషన్‌పై జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి ఆయన వెళ్లిపోయారు. అప్పటి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పారిశుధ్య పర్యవేక్షణ కొరవడటంతో రోజురోజుకీ వీధుల్లో చెత్త పేరుకుపోయి అధ్వానంగా మారడంతో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ గంజి. ప్రసాద్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈయన కూడా రెండు నెలల పనిచేసిన తర్వాత పని ఒత్తిడి కారణంగా రెండు బాధ్యతలు చేపట్టలేనని చెప్పడంతో కమిషనర్ టి.కృష్ణవేణి లిఖిత పూర్వక లేఖ ద్వారా అభ్యర్థించడంతో గంజి ప్రసాద్‌ను ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తప్పించారు.


నిడదవోలులో యర్నగూడెం రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

అనుభవం లేమి కారణంగా విమర్శల వెల్లువ

తర్వాత పారిశుధ్య కార్మికుల మేస్త్రీగా పనిచేస్తున్న కాకి నరసింహరాజుతో పాటు సచివాలయ శానిటరీ కార్యదర్శి సూర్యారావుకి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతలు అప్పగించారు. వీరిద్దరూ పట్టణంలో చేరొక భాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. అయితే వీరికి అనుభవం లేకపోవడంతో పట్టణంలో పారిశుధ్య పర్యవేక్షణ లోపిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. పారిశుధ్య కార్మికుల మేస్త్రీగా పనిచేస్తున్న కాకి నరసింహరాజు క్లాస్–4 ఉద్యోగి కావడంతో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా అర్హత లేకుండానే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. నిబంధల ప్రకారం క్లాస్ –4 ఉద్యోగికి ఫైల్‌పై సంతకాలు, పారిశుధ్య కార్మికుల దినసరి మస్టర్లు వేయడం, బిల్లుల పాస్ కావడానికి, వివిధ ఫైళ్లపై సంతకాలు చేయడానికి ఈయన అర్హత లేకుండానే తూతూ మంత్రంగా కానిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేసేందుకు మున్సిపల్ ఉన్నతాధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం


రావిమెట్లలో ఆంజనేయస్వామిని దర్శించుకున్న మంత్రి దుర్గేష్, కమిటీ సభ్యులు

నిడదవోలు రూరల్: రావిమెట్లలో అభయ ఆంజనేయస్వామి 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెలగన సూర్యారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు


బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం

చాగల్లు: బ్రాహ్మణగూడెం మెయిన్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన 28 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 28 వతేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన దాపర్తి సత్యనారాయణ, గోపాలకృష్ణవేణి దంపతులు, దాతలు సహకారంతో స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. 26వ తేదీన గ్రామోత్సవం, జగన్నాథపురం వారితో కోలాట భజన కార్యక్రమం, 27న ప్రత్యేక పూజలు, 28 వతేదీన విగ్రహ ప్రతిష్ఠ, ప్రథమారాధన, పీఠారోహణ, కళావాహనం పూజలు, అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

వర్షంలోనూ తప్పని జీవన పోరాటం


గజ్జరంలో వర్షం కురుస్తుండడంతో తలపై తాటాకులు పెట్టుకుని వెళుతున్న మహిళా కూలీలు

తాళ్లపూడి: వర్షంలోనూ తప్పని జీవన పోరాటం. మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. గజ్జరంలో కూలి పనులకు వెళ్లే మహిళలు వర్షంలోనే తడుస్తూ వెళుతున్నారు. కొందరు మహిళలు తల తడవకుండా తాటాకులను పెట్టుకుని పనులకు వెళ్లారు. బతుకు పోరాటంలో ఎండైనా వానైనా తప్పదు కదా అని వారన్నారు.